ప్రజాశక్తి
బుధవారం 26 ఫిబ్రవరి 2025

జీడి పరిశ్రమ అనుమతులపై త్వరపడండి : పిఒ

పార్వతీపురం : పట్టణంలో జీడి పరిశ్రమ స్థాపనకు అవసరమైన అనుమతులపై త్వరపడాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో జీడీ పరిశ్రమ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. జీడీ పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం కావాల్సిన వసతులను త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. వెలుగు సిబ్బందితో వీడీవీకెలన్నీ 365 రోజులు పని చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. పసుపును కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసి పసుపు పౌడర్‌ను విక్రయించాలని తెలిపారు. జీడీ పప్పు తయారీ కేంద్రానికి పిక్కలను కొనుగోలు చేయాల న్నారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎంవి కరుణాకర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, ఎపిపిసిబి ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి.కరుణ, జిసిసి డిఎం .మహేంద్ర కుమార్, వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఔను...! ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ బరిలో ఒకే ఒక్క మహిళ. మిగిలిన తొమ్మిది మందీ పురుషులే ఉన్నారు. ఇందులోనూ ఒకరు తాజా, మరొకరు మాజీ ఎమ్మెల్సీ. అయినా సరే అందరి నోటా ఆ మహిళ గెలుపు మాటే వినిపిస్తోంది. ఆమె ఎవరో కాదు. ఉపాధ్యాయ ఉద్యమ నేత, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, పలు సందర్భాల్లో పాలకపక్ష నాయకులను సైతం నిలువరించిన కోరెడ్ల విజయగౌరి. ప్రచారంలో ఆమె విశేష ఆదరాభిమానాలు చూరగొంటున్నారు.

ఒక మహిళ...9మంది పురుషులు

- హోరా హోరీగా ఎమ్మెల్సీ ఎన్నిక
- తాజా, మాజీలకు ముచ్చెమటలు
- ఎక్కడ విన్నా విజయగౌరి గెలుపు మాటే
- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 7న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న విషయం విధితమే. ఈ ఎన్నిక బరిలో మొత్తం పది మంది ఉన్నారు. వీరిలో యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, టిడిపికూటమి బలపర్చిన పి.రఘువర్మ, పిఆర్‌టియు నాయకుడు గాదె శ్రీనివాసుల నాయుడు మద్యే ప్రధాన పోటీ కనిపిస్తోంది. వీరిలోనూ విజయగౌరి ప్రచారంలోనూ, ఆదరణలోనూ మొదటి స్థానంలో వున్నారు. మిగిలిన ఇద్దరిలో శ్రీనివాసులు నాయుడు రెండు సార్లు, రఘువర్మ ఒక సారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసినప్పటికీ ప్రస్తుత ఎన్నికల్లో వారికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. శ్రీనివాసుల నాయుడు ఎమ్మెల్సీగా ఉన్న హయాంలో ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంతపాడుతూ కాలం వెల్లబుచ్చారు. గత ఎన్నికల్లో యుటిఫ్ సహకారంతో గెలిచిన రఘువర్మ కూడా పదవి వరించాక ఏకంగా ఉపాధ్యాయ లోకాన్నే మర్చిపోయారు. ఉత్తరాంధ్రలోనూ, ముఖ్యంగా విజయనగరంలో గడిచిన ఆరేళ్లలో జరిగిన అనేక ఉపాధ్యాయ ఉద్యమాల్లో ప్రభుత్వాల తప్పుడు విధానాలపై నోరు మొదపకపోవడం ఇందుకు తార్కాణమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఉత్తరాంధ్రలోనూ, ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మోయాల్సిన బాధ్యత యుటిఎఫ్ తీసుకుంది. ఇలా జరిగిన ఉద్యమాల్లో విజయగౌరి తనదైన పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే విజయగౌరికి పిడిఎఫ్ తరపున పోటీచేసే అవకాశం లభించింది. ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ పరిరక్షణ లక్ష్యంగా పిడిఎఫ్ ఇచ్చిన పిలుపు మేరకు తన ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ ఎన్నికల బరిలో దిగారు. యూనియన్లు, ప్రాంతాలకు అతీతంగా ఆదరణ కనిపిస్తోంది. విజయగౌరి గెలపు అనివార్యమైతే శాసన మండలిలో ఇరకాటంలో పడాల్సి వస్తుందని భావించిన కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా టిడిపి తనకు అణిగిమనిగి ఉండే రఘువర్మకు మద్దతు ప్రకటించింది. అసలే రఘువర్మ వైఖరిపై అసహనంతో ఉన్న ఉపాధ్యాయులు ఎన్నికల మాట నిలబెట్టుకోని టిడిపిపై కూడా గుర్రుగా ఉంది. ఈ రెండు కారణాలు రఘువర్మకు తీవ్రమైన ప్రతికూల అంశాలుగా ఉన్నాయి. 'అధికార పార్టీతో జతకట్టిన అభ్యర్థి ఉపాధ్యాయ హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం ప్రభుత్వాన్ని ఎలా ప్రశ్నించగలుగుతారు' అన్నది ఉపాధ్యాయుల భావన. తీరా మద్దతు ప్రకటించాక ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత బహిర్గతం కావడంతో కూటమి ప్రభుత్వానికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. దీంతో నేరుగా సిఎం చంద్రబాబే రంగంలో దిగి ఎంపీ, ఎమ్మెల్సీలు, చివరికి మంత్రులు కూడా ఎన్నికల ప్రచారానికి ఉసుగొల్పారు. వీరంతా స్కూళ్లు, కాలేజీల్లో తిరుగుతూ ఓట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. తమ ప్రచారం వల్ల ప్రయోజం లేదని తెలిసినా అధినేత చెప్పాక తప్పదుగా అంటూ కొందరు ముందుకు సాగుతున్నారు.

ఇక రెండుసార్లు ఉపాధ్యాయ ఓట్లతో ఎమ్మెల్సీగా అందలమెక్కిన శ్రీనివాసులు నాయుడు ప్రోటోకాల్ పొందడానికే పరిమితమయ్యారు. ఆయన పదవీ కాలంలో ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు సాధించేందుకుగానీ, నూతన విద్యావిధానం పేరిట పాఠశాలల విలీనం, అంతకు ముందు రేషనలైజేషన్ పేరిట స్కూళ్ల మూసివేతకు వ్యతిరేకంగా గానీ, ఉపాధ్యాయులు ఎదుర్కొన్న సమస్యలపై గాని పనిచేయలేదు. బహుశా అందుకే గత ఎన్నికల్లోనే ఉపాధ్యాయులు శ్రీనివాసనాయుడ్ని పక్కనబెట్టారు. ఇలా వీరిద్దరికీ ఓట్లు వేసి మోసపోయిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు విజయగౌరివైపు చూస్తున్నారు. విజయగౌరి గెలుపు కోసం యుటిఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలతో పాటు పిడిఫ్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆమె కుటుంబ నేపథ్యం, పోరాట చరిత్ర ఇందుకు దోహపడుతున్నాయి. పలు ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నుంచి ప్రాంతాలకు అతీతంగా ఆదరణ కనిపిస్తోంది. ఈనేపథ్యంలో విజయగౌరి విజయం తథ్యం అనే చర్చ ముమ్మరంగా సాగుతోంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది.

ఎన్నికల నిర్వహణపై సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్; ఎస్‌పి మాధవరెడ్డి

సమన్వయంతో ఎన్నికలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలను అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సెక్టోరియల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో సెక్టోరియల్ అధికారులు కీలక పాత్ర వహించాల్సి ఉందన్నారు. జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాలకు 30 బ్యాలెట్ బాక్సులను సరఫరా చేస్తున్నామని, ఒక బాక్సును మాత్రమే వినియోగించాలన్నారు. బుధవారం ఉదయం 6గంటల నుంచి కలెక్టరేటులో పోలింగ్ సామగ్రి పంపిణీ ఉంటుందని, వాటిని ఆయా పిఒ, ఎపిఒల ద్వారా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు పంపే బాధ్యతను సెక్టోరియల్ అధికారులు తీసుకోవాలని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్ట్ ఏర్పాట్లు అవుతున్నాయని, వెబ్ కాస్ట్, ఇతర పోలింగ్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించాలని అన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి వసతి, భోజన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తుతో పాటు రాజకీయ పక్షాలకు చెందిన జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు వంటివి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబందించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేయాలని తెలిపారు. తక్కువ స్థాయిలో ఓటర్లు ఉన్నప్పటికీ అధికారులంతా సమన్వయం చేసుకొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి, జెసి ఎస్.ఎస్.శోభిక, ఎఎస్‌పి సురాన అంకిత్ మహావీర్, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, డీఎస్పీ ఎం.రాంబాబు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ఎడిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, ఆర్‌టిఒ ఎం.శశికుమార్, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డార్టప్‌కు పార్వతీపురం మన్యం ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా వ్యవసాయ, గ్రామీణ పరివర్తన ప్రణాళికకు మన్యం జిల్లా ఎంపికైందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు నీతి అయోగ్ జిల్లా వ్యవసాయ, గ్రామీణ పరివర్తన పేదరికాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబం, ఆరోగ్యం, శ్రేయస్సు, గ్రామీణ ఆర్థికవృద్ధికి మార్గాలను సృష్టిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా రైతుల ఆదాయాలు, ఉత్పాదకత, ఉపాధిని పెంపొందించనుందని అన్నారు. ప్రాథమిక రంగాల వృద్ధిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ, గ్రామీణ పరివర్తన ప్రణాళికకు సంబంధించి నివేదికను 10 రోజుల్లో సిద్ధం చేయాలని వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నివేదిక తయారీలో పారదర్శకతను, నాణ్యతను పాటించాలని తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ కింద ఫార్మ్ పండ్స్‌ను ఇప్పటివరకు 2,236 మంజూరు చేశామని, మరిన్ని మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కొత్త ఫార్మ్ పాండ్స్ అంచనాలను వేయడంతో పాటు అవి గ్రౌండింగ్ కావాలని ఆదేశించారు. అలాగే చెక్ డ్యాములు, ఫిష్ పండ్స్ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో నిమ్మగడ్డికి అనుకూల వాతావరణం ఉందని, దీనిపై దష్టి సారించాలని అన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో మరింత పురోగతి ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి శ్యామల, వి.తిరుపతయ్య, ఎవి సాల్మన్‌రాజు, డాక్టర్ ఎస్.మన్మధరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, ఐటిడిఎ, డివిజనల్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా విద్యుత్ వినియోగదారుల సదస్సు

ప్రజాశక్తి - సాలూరు

ఎపిఇపిడిసిఎల్‌కు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన సదస్సు మొక్కుబడిగా జరిగింది. విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధించిన సదస్సు సాలూరులో జరుగుతుందనే ప్రచారం విస్తతంగా చేయకపోవడంతో వెలవెలబోయింది. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల పరిధిలో ఏజెన్సీ గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. మైదాన ప్రాంత గ్రామాల్లోనూ అనేక సమస్యలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సు నిర్వహించేటప్పుడు అధికారులు గ్రామాల్లో అందరికీ తెలిసేలా దండోరా వేయించాలి. కానీ ఆవిధంగా స్థానిక సబ్‌డివిజన్ అధికారులు ఆ విధమైన ప్రచారం చేయలేదు. దీంతో మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం నిర్వహించిన కార్యక్రమానికి అతి తక్కువ మంది హాజరయ్యారు. కేవలం 13మంది మాత్రమే తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని అర్జీల రూపంలో అందజేశారు. వారం రోజుల ముందు నుంచి ఈ కార్యక్రమానికి సంబంధించిన సమాచారం సబ్ డివిజన్ అధికారులకు తెలిసినప్పుడు విస్తృత ప్రచారం చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో ఎక్కువ ప్రచారం కల్పిస్తే ఎక్కువ మంది హాజరై ఎక్కువ అర్జీలు వస్తాయనే భయంతోనే అధికారులు తూతూమంత్రంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సదస్సుకు హాజరైన వారిలో సగానికిపైగా విద్యుత్‌శాఖలో పని చేస్తున్న సిబ్బందే వున్నారు. సబ్ డివిజన్ స్థాయిలో ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నప్పుడు మూడు మండలాలు, ఒక మున్సిపాలిటీ పరిధిలో విస్తృత ప్రచారం కల్పిస్తే కనీసం వంద సమస్యలకు సంబంధించిన అర్జీలు అందేవి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం నిర్వహించిన కార్యక్రమాన్ని మమ అనిపించారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రచారం చేయకపోవడంతో తక్కువ అర్జీలు

సదస్సులో మాట్లాడుతున్న ఎపిఇపిడిసిఎల్ అధికారులు

ఆరుబయట చెత్త కనిపించరాదు

ప్రజావక్తి - పార్వతీపురం

స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా ఆరుబయట చెత్త కనిపించరాదని, ఆ దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ పార్వతీపురంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ తన ఛాంబరులో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుబయట చెత్త కనిపించకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇందుకు స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ సహకారం తీసుకోవాలని చెప్పారు. ప్రతి మున్సిపాల్టీ, పరిసర పంచాయతీల నుంచి ఇద్దరు ఆసక్తి గల యువకులను ఎంపిక చేయాలని సూచించారు. ఇందుకు ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లు సంయుక్తంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపిక చేసిన యువతకు మార్చి 1 నుంచి పారిశుధ్యంపై శిక్షణను నిర్వహిస్తామని, ఈ శిక్షణకు అవసరమైన ప్రతిపాదనలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా రాబోయే ఆరు మాసాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమయ్యే నిధుల వివరాలను స్వచ్ఛంధ్రా కార్పొరేషన్‌కు పంపించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో చెత్త ఆరుబయట కనిపించకుండా చర్యలు చేపట్టి, చెత్త నుంచి సంపదను సృష్టించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డిపిఒ టి.కొండలరావు, జట్టు ఆశ్రమం సభ్యులు వి.పద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగభూషణరావు, డీఎల్డీఒలు రమేష్ రామన్, వివి గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బీభత్సం

- పెద మేరంగి కూడలిలో రైస్ మిల్లులో చొరబడి తలుపులు, కిటికీలు ధ్వంసం
- ధాన్యం, బియ్యం బస్తాలు చిందరవందర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో అడవి ఏనుగుల బీభత్సం కొనసాగుతూనే ఉంది. అడవి ఏనుగుల నుంచి ప్రజలను రక్షిస్తామని, కుంకీ ఏనుగులను తీసుకొొచ్చి ఈ ప్రాంతం నుంచి అడవి ఏనుగులను తరిమి వేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేసిన ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. అడవి ఏనుగుల సంచారంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా క్షణక్షణం భయం భయంతో జీవనం సాగిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో అడవి ఏనుగుల గుంపు ఒకే మిల్లుపై దాడి చేసి నిల్వ ఉంచిన ధాన్యం, బియ్యం బస్తాలను ధ్వంసం చేశాయి. వివరాల్లోకి వెళ్తే

జియమ్మవలస మండలం పెదమేరంగి కూడలి సమీపాన గల శ్రీ సాయి గాయత్రి మినీ మోడరన్‌రైస్ మిల్లులో సోమవారం అర్ధరాత్రి ఏనుగులు గుంపు బీభత్సం సృష్టించాయి. మిల్లులోకి ప్రవేశించి కిటికీల తలుపులు ధ్వంసం చేసి మిల్లులో ఉన్న బియ్యం, ధాన్యం తిని చిందరవందర చేసి వెళ్లిపోయాయి.

ఏనుగుల ధ్వంసం చేసిన బియ్యాన్ని పోగు చేస్తున్న మహిళలు

ఎప్పటి లాగానే మంగళవారం ఉదయం మిల్లు యజమాని అక్కడకు వెళ్లి పరిస్థితిని చూసి తీవ్ర భయాందోళన చెందారు. ఇదే మిల్లులో ఏనుగుల వల్ల ఇలా జరగడం ఇది ఆరో సారి కావడం గమనార్హం. జనవరి 30 అడవి ఏనుగుల గుంపు ఇదే మిల్లు పై దాడి చేయగా, ఈనెల 3న రాత్రి మళ్లీ చొరబడ్డాయి. ఇలా జరగడడం వల్ల ప్రతి సారీ కనీసం వేలాది రూపాయలు నష్టం సంభవిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల్లో 2 సార్లు ఇదే మిల్‌పై దాడి చేయడంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు లబోదిబోమంటున్నారు.

ఏనుగుల కదలికలపై పరిశీలనల చేయాల్సిన అటవీ శాఖ సిబ్బంది పగలు మాత్రమే గమనించి రాత్రి వేళల్లో అసలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే ఆ రైస్ మిల్లు పక్కనే జనావాసం నివసించే కాలనీ ఉందని జరగరానిది ఏమైనా జరిగితే దీనికి బాధ్యులు ఎవరని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఏనుగులను తరలిస్తామన్న కూటమి ప్రభుత్వం ఇంకెప్పుడు తరలిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు తన మిల్లు వద్ద జరిగిన నష్టాన్ని పరిశీలించి పరిహారాన్ని ఇప్పించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు.

జొన్న చేనులో ఏనుగుల తిష్ట

రైస్ మిల్లును ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న జొన్న చేనును మంగళ వారం సాయంత్రం ధ్వంసం చేశాయి. దీంతో స్థానిక రైతు లబోదిబోమంటున్నాడు. ఈ గుంపును త్వరగా తరలించాలని అటవీశాఖ అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

బస్సులను అడ్డగింత

పేదమేరంగి జంక్షన్ వద్ద ఏనుగులు గుంపు రోడ్డుకు అడ్డంగా ఉండి బస్సులను అడ్డగించాయి. దీంతో ప్రయాణికులు భయపడుతున్నారు. అరగంట పాటు ప్రయాణికులు బస్సుల్లోనే బితుకు బితుకు మని ఉన్నారు.

జొన్నచేలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి - సాలూరు

ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే ఊపిరిగా పనిచేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట మండలాల్లోని ప్రభుత్వ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. మంగళవారం ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో యుటిఎఫ్ జిల్లా నాయకులు సత్యం నాయుడు, చంద్రినాయుడు, సత్యనారాయణ, ప్రసాద్, శ్యాం పట్టణంలోని గాడివీధి మున్సిపల్ హైస్కూల్, డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి విజయ గౌరిని గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గతంలో ఎన్నో పోరాటాలు చేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉపాధ్యాయులకు వుందని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా మహిళా సభ్యులు రాజమణి, ఎం.ఈశ్వరమ్మ, ఎం.శ్రీలక్ష్మి, ఈదుబిల్లి జానకీ, పెంకి ఉషారాణి, పాచిపెంట, సాలూరు మండలాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తొలిసారి మహిళా ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయగౌరి పోటీ చేస్తున్నారని, మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన విస్తృత ప్రచారం
ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన

ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

రీసర్వేతో భూ సమస్యలకు చెక్ : కలెక్టర్

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేతో రైతుల భూ సమస్యలు తొలగి రైతులకు, భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని శివరాంపురం పైలట్ గ్రామంగా తీసుకొని నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రైవేటు భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల, పోరంబోకు భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేస్తారన్నారు. తద్వారా రైతులకు భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే భూ కొలతలు కొలిచి మీ భూమికి హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి రీసర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులు దొర్లకుండా పక్కగా నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు ఎంత మేర సర్వే నిర్వహించినట్లు తహశీల్దార్ కె.శివయ్యను ప్రశ్నించగా 216 ఎకరాల గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన భూ యజమానుల వారసులకు మార్పు చేసేలా ఎఫ్ఎంసి విచారణ పూర్తి చేసి మ్యూటేషన్లను పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లు, రైల్వే ట్రాక్‌కు కేటాయించిన భూముల్లో హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలన్నారు. చెరువులు, వాగుల్లో ఆక్రమణలను తొలగించాలని సూచించారు. సర్వే ప్రక్రియ జరిగిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ శివయ్య, మండల సర్వేయర్ వంశీకృష్ణ, విఆర్ఒ మహిపతి, గ్రామసర్వేయర్ వి.సుష్మిత, సచివాలయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న రైతులు

గుడ్లు, మాంసంపై అపోహాలొద్దు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మాంసం, గుడ్లు తినడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని, వీటిపై లేనిపోని అపోహాలు వద్దని వెంకాబ్ పౌల్ట్రీ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మాంసం, గుడ్లుపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు ఎవరైనా సరే మాంసం, గుడ్లు తినడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని దీనివల్ల ఎటువంటి వ్యాధులు, రోగాలు గాని రావని, ఇది అపోహ మాత్రమేనని దీన్ని ఎవరూ నమ్మొద్దని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రజలకు ఉచితంగా చికెన్ పకోడీ, చికెన్ కర్రీని అందజేశారు. కార్యక్రమంలో వెనకాబ్ ప్రతినిధులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ఇవిఎం గోడౌన్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇవిఎంల నిక్షిప్తంగా భద్రపరచిన గోడౌన్‌ను పీరియాడిక్ తనిఖీల్లో భాగంగా అక్కడ భద్రత, గోడౌన్‌కు వేసిన సీల్‌లను నిశితంగా పరిశీలించారు. ఇవిఎం గోడౌన్ వద్ద భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, కలెక్టర్ కార్యాలయ ఇన్‌ఛార్జి ఎఒ జయ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బందిని ఆదేశించారు. కేంద్రం వద్ద విద్యుత్, మరుగుదొడ్లు, మంచినీటి , వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఆర్ఐ ఎన్.లక్ష్మునాయుడు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి వైద్యాధికారిని ఆదేశించారు. వీరఘట్టంలోని 24 గంటల ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ప్రభుత్వం వైద్యంపై నమ్మకం కలిగేలా వైద్యం అందించాలన్నారు. అనంతరం ఇడిడి క్యాలెండర్ను పరిశీలించడంతో పాటు మందులు గది, లేబర్ రూము, టెక్నీషియన్ రూము తదితరమైనవి పరిశీలించారు. పిఒ వెంట స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన పీసా చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13 నుంచి 25 వరకు నిర్వహించిన పీసా చట్టంపై అవగాహన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. పీసా చట్టంపై 27 పంచాయతీల్లో ఉన్న సర్పంచులు, ఎంపిటిసి లు, వార్డ్ మెంబర్లు, పీసా సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్, మండల స్థాయి అధికారులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, సచివాలయం ఉద్యోగులకు పీసా చట్టం అధికారాలు, విధులు, హక్కులు అనే అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, పర్యవేక్షణ అధికారి దేవుళ్ల తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆదివాసీ గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మన్యం జిల్లాలో గిరి శిఖర గ్రామల గిరిజన ప్రజలు చింతపండు, కొండ చీపురులు, జీడి పిక్కలు, పసుపు, కందులు తదితర పంటలు పండించి జీవనం సాగిస్తున్నారని కానీ వాటికి సరైన గిట్టుబాటు ధర లేక దళారులు గ్రామాలకు వెళ్లి వారిని మభ్యపెట్టి తక్కువ వరకు ధరకు కొనుగోలు చేస్తున్నారని దానివల్ల గిరిజన ప్రజలు నష్టపోతున్నారని తక్షణమే ఐటిడిఏ పిఓ స్పందించి గిరిజనుల పంటలను జిసిసి డిపోల వద్ద మద్దతు ధరకు సరుకులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజలను ఆదుకోవాలని ట్రైబల్ రైట్స్ ఫోరం తరపున కోరుతున్నామన్నారు.

మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డిడి కృష్ణవేణి

బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి మంగళవారం సందర్శించారు. టెన్త్ విద్యార్థులకు పరీక్షలు సంబంధించి పలు సూచనలు చేశారు. పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని కోరారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మెనూ పరిశీలించి విద్యార్థులతో. భోజనం చేశారు. మరుగుదొడ్లు, డార్మిటరీ, ఆర్ఒ ప్లాంట్ పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యం తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. డిడి వెంట ప్రధానోపాధ్యాయులు వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థినికి కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ వై నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం బైపిసి చదువుతున్న కాగాన సుస్మితకు తల్లిదండ్రులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్న కళాశాల గణిత అధ్యాపకులు అప్పలనాయుడు తన పాత విద్యార్థుల నుంచి రూ.20,500, సిబ్బంది, విద్యార్థులు రూ.9500 అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందజేసిన విద్యార్థులు పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు.

జె.గోపాలపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధిలో గల జె.గోపాలపురంలో మంగళవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు 50మంది హాజరు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో మంగళవారం సీతంపేట వైటీసీలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 50 అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 35 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారు నెల్లూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కిల్ కాలేజ్ కోఆర్డినేటర్ వెంకట రమణ, కంపెనీల హెచ్‌ఆర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చక్ర తీర్థ స్నానాలు

ప్రజాశక్తి -భామిని

విగ్రహాలకు చక్రస్నానం చేస్తున్న అర్చకులు

ఉమా రామ లింగేశ్వర స్వామి యాత్ర మహోత్సవంలో భాగంగా మంగళవారం వంశధార నదిలో చక్ర తీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉమా రామలింగేశ్వర ఆలయం నుంచి శివపార్వతుల విగ్రహాలను పల్లకిలో మేళతాళాలతో భామిని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వంశధార నదిలో విగ్రహాలకీ స్నానమాచరించారు. మంగళవారం సాయంత్రం శివపార్వతుల కల్యాణాన్ని ఆలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రోబి రుణ, ఉమారుణ, ఆలయం కమిటీ సభ్యులు , గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ముస్తాబైన శైవక్షేత్రాలు

- మహాశివరాత్రికి పోటెత్తనున్న యాత్రికులు
- అడ్డాపుశీలకు ఆధ్యాత్మిక శోభ

ప్రజాశక్తి - కొమరాడ

మహాశివరాత్రికి మండలంలోని జిల్లాలో గల పలు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. కొమరాడ మండలం కోటిపాం పంచాయతీ గుంప సోమేశ్వర స్వామి ఆలయంలోని శివుడికి చేపల కూర నైవేద్యంగా సమర్పిస్తారు. పంచ లింగాల్లో ఒకటైన గుంప సోమేశ్వర ఆలయం నాగావళి తీరంలో ఉంది. ఆ ప్రాంతంలోనే జంఝావతి, నాగావళి నదుల సంగంలో ఈ ఆలయాన్ని ద్వాపరయుగంలో బలరాముడు ప్రతిష్ఠించినట్లు స్థల పురాణాలు పేర్కొంటున్నాయి. శివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా ఈ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో శివుడికి చేపల కూరతో నైవేద్యం సమర్పిస్తారు. చేపల కూర నైవేద్యం పెడితే మనసులోని కోరికలు నెరవేరుతాయని ఈ ప్రాంతంలోని ప్రజల నమ్మకం. తరతరాలుగా ఇదే ఆచారాన్ని పాటిస్తూ దశాబ్దాలుగా పూర్వీకులు పాటించిన సంప్రదాయాలు తాము కూడా అనుసరిస్తామని భక్తులు పేర్కొంటున్నారు. శివరాత్రితో పాటు కార్తీక మాసంలో అత్యధికంగా భక్తుల రద్దీ ఆలయానికి ఉంటుంది. మిగిలిన శని, సోమవారాల్లో ఒడిస్సా ఉత్తరాంధ్రాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో సోమేశ్వర స్వామిని దర్శనం చేసుకుంటారు.

యాత్రికుల ఆకలి తీరుస్తున్న దాతలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గుంప సోమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి తర్వాత ఒండో రోజు యాత్ర సందర్భంగా వేల సంఖ్యలో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి యాత్రికులు భారీగా తరలివస్తుంటారు. ఈ సమయంలో కనీసం దేవాదాయ శాఖ అధికారులకు భక్తులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోగా తాగేందుకు నీరు కూడా ఉండని పరిస్థితి. గత రెండు, మూడేళ్ల నుంచి సమీప గ్రామాల ప్రజలు భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా తమ గ్రామాల్లో ఆర్థిక సహాయం కుడపెట్టుకొని యాత్రికులకు మంచినీరు, భోజనం సౌకర్యాలు కల్పిస్తున్నారు. స్వామి నాయుడు వలస, గంగరేగువలస, కోటిపాం, కొమరాడ, గుమడ, మాదిలింగికి తదితర గ్రామాల ప్రజలు ప్రతి ఏటా దాతల సహకారంతో రెండు రోజులు పాటు భోజనం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఆదాయం ఉన్నా సౌకర్యాలు సున్నా

గుంప సోమేశ్వర స్వామి ఆలయానికి ఎంతో ప్రతిష్ట ఉన్నప్పటికీ ఆలయ అభివృద్ధిని పట్టించుకునే వారే లేకపోయారని ఈ ప్రాంత ప్రజల నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా శివరాత్రి, కార్తీకమాసంలో వచ్చిన ఆదాయాన్ని దేవాదాయశాఖ తీసుకుంటుంది తప్ప కనీసం ఆలయ అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చు పెట్టే పరిస్థితి లేదు. ఈ విషయంపై దేవాదాయ శాఖ ఇఒను ప్రశ్నించగా కనీసం ఎటువంటి బడ్జెట్ లేదని అందుకే నామమాత్రంగా ఈ పనులు చేస్తున్నట్లు చెప్పడం విడ్డూరం. ప్రసాదాలు, దుకాణాలు, హుండీ, టికెట్ల రూపంలో వస్తున్న ఆదాయానికి ఏ రోజూ లెక్క చెప్పే పరిస్థితి కనిపించడం లేదని సమీప ప్రాంతాల ప్రజలు అంటున్నారు. ప్రతి ఏటా భక్తుల సౌకర్యాలు కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ఆర్భాట ప్రచారాల తప్ప కనీసం యాత్రికులకు తాగు నీరు కూడా అందించే పరిస్థితి. క్యూ లైన్లో ఉండే యాత్రికులకు ఎండ నుంచి విముక్తి పొందేందుకు కనీసం టెంట్లు కూడా సక్రమంగా వేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

పార్వతీపురం నుంచి 10 ప్రత్యేక బస్సు సర్వీసులు

పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి గుంప శివాలయానికి దర్శనం కోసం వస్తున్న యాత్రికుల రాకపోకల కోసం 10 బస్సులను ఆర్టీసీ అధికారులు నడుపుతున్నారు. పార్వతీపురం, విక్రాంపురం, అర్తాం, స్వామినాయుడువలస, గంగరేగువలస మీదుగా గుంప శివాలయానికి వెళ్లి అక్కడి నుంచి పాతకల్లి కోట, అర్తాం, విక్రమంపురం మీదుగా పార్వతీపురానికి బస్సు నడుపుతున్నట్టు అధికారులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించేందుకు వైద్య సిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక ఎస్సై కె.నీలకంఠం ఆధ్వరంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అడ్డాపుశీలకు ఆధ్యాత్మిక శోభ

పార్వతీపురం రూరల్ : మండలంలోని అడ్డాపుశిలలో స్వయంభువుగ వెలసిన కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం మహాశివరాత్రి సందర్భముగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జిల్లా నుండే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన యాత్రికులు తండోపతండాలుగా వచ్చి పర్వత శ్రేణుల్లో కొలువైవున్న పరమేశ్వరుని దర్శించుకుని ఆధ్యాత్మిక అనుభూతి చెందుతారు. ఈ ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మరడ తవిటి నాయుడు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పెద్దమనుషుల కమిటీ ఏర్పాటు చేస్తుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా క్యూలైన్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం ఉదయం నుండి గురువారం వేకువజాము వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆలయ అర్చకులు శ్రీనివాస్ పాడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవం సందర్భంగా భక్తుల ప్రత్యేకంగా స్వామివారికి అర్చనలు చేస్తున్నట్లుగా ఆలయ కమిటీ తెలిపింది. వందలాదిగా తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రపంచంలోకెల్లా ఎత్తైన నంది విగ్రహానికి రంగులతో అలంకరించారు. భవిష్యత్తులో ఇక్కడ పెద్ద ఎత్తున వివాహాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి భక్తుల విరాళాలతో లక్షలాది రూపాయలు వెచ్చించి కళామండపం నిర్మిస్తున్నామని, కొద్ది రోజుల్లో అది భక్తులకు అందుబాటులోకి రానున్నదని ఆలయ నిర్వాహకులు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాకు తలమానికమైన ఈ దేవాలయాన్ని గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి వెంకటేశ్వర స్వామి, కొమరాడ మండలంలోని గుంప సోమేశ్వర స్వామి దేవాలయంతో కలిపి అభివద్ధి చేయగలిగితే ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెంది, జిల్లాకు పర్యాటక శోభను తీసుకువస్తుందని భక్తులు ఆశిస్తున్నారు.

నాగావళి నది ఒడ్డునున్న గుంపస్వామి ఆలయం

అడ్డాపుశిలలో కొండల మధ్య గల కాశీవిశ్వేశ్వర ఆలయం

కొండగుహకు ఇత్తడి శోభ

జిల్లాలోని అడ్డాపుశిల స్వయంభూ విశ్వే శ్వరాలయం కొత్త శోభను సంతరించుకుంది. ఆలయంలో గచ్చులు వేశారు. లోపల గుహ ముఖద్వారం వద్ద ఇత్తడి మండపం, గోడలకు శివపార్వతుల కల్యాణ ఘట్టాల చిత్రాలతో ఇత్తడి రేకులుగా అమర్చుతున్నారు. పార్వతీపురానికి చెందిన శిల్పి డి.నారాయణరావు బృందం పనులు చేస్తోంది. 8మంది దాతలు 230 కిలోల ఇత్తడి అందజేసినట్లు ఇఒ ప్రసాద్ తెలిపారు.

పారమ్మకొండకు 25 ప్రత్యేక బస్సులు

సాలూరు: ఈనెల 26 మహాశివరాత్రి సందర్భంగా పారమ్మకొండకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 25 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరెడ్డి తెలిపారు. సాలూరు నుంచి పారమ్మకొండకు రూ.20లు చొప్పున బస్‌ఛార్జీ వసూలు చేయనున్నామని చెప్పారు. సాలూరు నుంచి బుధవారం ఉదయం నుంచి తిరిగే షటిల్ సర్వీస్ బస్సులను భక్తులు వినియోగించుకోవాలని మేనేజర్ ఒక ప్రకటనలో కోరారు.

ప్రమాదాలను నివారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం కలెక్టర్, ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో, రద్దీ ప్రదేశాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అలాగే రద్దీ ప్రాంతాలు, ప్రముఖ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగంతో చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చనివివరించారు. ఈగల్ మాదిరిగా గ్రామ స్థాయిలో పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పాఠశాల, కళాశాల స్థాయిలో ఈగల్ క్లబ్బులు ఏర్పాటు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్లబ్బుల ద్వారా ఈగల్‌కు మద్దతుగా రహదారి భద్రత, మత్తు పదార్థాల నివారణ తదితర అంశాలపై సచివాలయ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈగల్ క్లబ్బుల ఏర్పాటుకు కమిటీని నియమించాలని, శిక్షణ ఇచ్చిన అనంతరం ఈగల్ క్లబ్ విధులు, బాధ్యతలను కేటాయించాలని చెప్పారు. రహదారి భద్రతపై తీసుకోవాల్సిన, తీసుకుంటున్న చర్యలపై సోషల్ మీడియా ద్వారా విస్తత ప్రచారం కల్పించాలని, కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. పోలీస్ శాఖ తీసుకున్న పటిష్ట చర్యలతో రహదారి ప్రమాదాలు చాలావరకు తగ్గాయని, ప్రమాదాలను పూర్తిగా నివారించేలా విశేష కషిచేయాలని పిలుపునిచ్చారు. రహదారి ప్రమాదాలను, మత్తుపదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో పోలీస్ యంత్రాంగం చూపిన పనితీరుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. రిమోట్ ప్రాంతాల్లో నిఘాను పెంచేందుకు పోలీస్ యంత్రాంగం వినియోగిస్తున్న డ్రోన్ విధానాన్ని ఎక్సైజ్ శాఖ కూడా వినియోగించడం ద్వారా నాటు సారా, మత్తు పదార్థాల తయారీ కేంద్రాలను నివారించేందుకు సహాయపడుతుందని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, పూర్తిగా నివారణకు జిల్లా యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే హెల్మెట్ ధారణ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుమును విధిస్తున్నామన్నారు. బ్లాక్ స్పాట్ ల వద్ద బోర్డుల ఏర్పాటు ద్వారా కొంతమేర ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

సమావేశంలో ఎఎస్పీ సురాన అంకిత్ మహావీర్, డిఎస్‌పి ఎం.రాంబాబు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ అధికారి బి.శ్రీనాథుడు, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పుష్ప శ్రీవాణిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

మాజీ డిప్యూటీ సిఎం పాములు పుష్పశ్రీవాణిని చినమేరంగిలో గల తన అతిథి గృహంలో మాజీ ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకటరావు, వైస్ ఎంపిపి అన్నాజీరావు తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుస్సాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకముంచి కురుపాం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా వైసిపి అధిష్టానం ఇచ్చినందుకు పుష్ప శ్రీవాణికి, మన్యం జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజుకు ధన్యవాదాలు తెలుపుతూ వారి సూచనలు, సలహాలు పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నీలకంఠపురం సర్పంచ్ ఎ.మన్మధరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

ఆశా, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించాలి

6న చలో విజయవాడ : సిఐటియు

ప్రజాశక్తి - కొమరాడ

ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లతో కలిసి సిఐటియు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కొమరాడ, మాదలింగి, రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 110 మంది వరకు ఆశా వర్కర్లు, వందకు పైగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. వీరికి పని భారం తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ,రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. టిఎ, డిఎ ఇవ్వాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెన్షన్ బెనిఫిట్స్ కల్పించాలని, ఉపాధి పనులు కల్పించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలను కోరుతూ మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేసేలా ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, పార్వతి, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్రువపత్రం అందజేస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

రక్తదాన శిబిరాలు ఎంతో అవసరం : పిఒ

ప్రజాశక్తి - పాలకొండ

గిరిజన ప్రజల్లో ఎక్కువ శాతం రక్తహీనత ఉంటుందని, అటువంటి వారికి రక్తం చాలా అవసరమని, ఆ లోటును పూడ్చడానికి రక్తదాన శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. పాలకొండ పట్టణంలోని తమ్మినాయుడు విద్యా సంస్థల ఆధ్వర్యాన ఎన్‌సిసి కార్యక్రమంలో భాగంగా మేము సైతం మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం పిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాతలను అభినందిస్తూ, తమ్మినాయుడు విద్యాసంస్థలు ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పిఒ మాట్లాడుతూ రక్తనిల్వల్లేవని, ఆ లోటును పూడ్చటానికి పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి, శ్రీకాకుళం రెడ్ క్రాస్ సంస్థ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన రోగులకు రక్తం అందించడం ముదావహమని అన్నారు. రక్తదానం చేసిన విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, పశు వైద్య సిబ్బందిని అభినందించి విజేతలకు సర్టిఫికేట్లను బహూకరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.శివ్వాల మన్మధరావు మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు మేము సైతం రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందులో తమ్మినాయుడు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది 126 మంది రక్తదానం చేశారని, వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిఒ ఎం.చంద్రమౌళి, ఎడిలు డాక్టర్ పి.మాణిక్యరావు, బి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ఎ.తిరుపతిరావు, జి.అశోక్‌కుమార్, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎన్.సన్యాసిరావు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సూచనల కోసమే 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని రైతులకు సత్వర సలహాలు, సూచనలు అందించడం కోసం ఒకే రోజు అన్ని రైతుసేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిలో తెలిపారు. ఈ మెగా పొలం పిలుస్తోంది కార్యక్రమం సందర్భంగా మంచాడవలస, శ్యామలగౌరీపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులంతా తాము పండించిన పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం రైతులందరికీ రిజిస్ట్రేషన్ చేయించి విశిష్ట సంఖ్యల కేటాయింపు జరుగుతుందన్నారు. రైతులంతా ఈ విశిష్ట సంఖ్యలను పొందాలని తెలిపారు. ప్రస్తుతం పొడి వాతావరణం నెలకొన్న నేపథ్యంలో వరి, మొక్కజొన్న పంటలపై రసం పీల్చుపురుగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు తప్పనిసరిగా విఎఎల సలహాలు, సూచనలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమగ్రాభివృద్ధికి జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతమే చేసి సమగ్ర అభివృద్ధి సాధించడమే జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం ముఖ్యోద్దేశమని డిఆర్‌పి రాంప్రసాద్ నాయుడు అన్నారు. జియ్యమ్మవలస మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ పాఠశాల వద్ద మంగళవారం మండలంలోని అంగన్వాడీలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోర్సులో భాగంగా ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని, దీనిలో భాగంగా అంగన్వాడీ వర్కర్లకు పిల్లల సమగ్ర అభివృద్ధి, పిల్లలు ఎలా నేర్చుకుంటారు, ఎలా నేర్పించాలి, వాళ్ల అభివృద్ధిలో శారీరక, మానసిక, మేధాభివృద్ధి, సాంఘిక అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ గౌరమ్మ, ప్రథమ కోఆర్డినేటర్ ప్రదీప్, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీలు ఆరు రోజులుగా జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను చిన్నారులకు చక్కగా అందించి వారి పురోగతిని కాంక్షించాలని ఎంపిడిఒ ఎస్.సాల్మన్ రాజు, ఎంఇఒ బి.చంద్రశేఖర్, ఇన్చార్జి సిడిపిఒ ఎన్.రాజ్యలక్ష్మి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వీరు మాట్లాడారు. ఈ సందర్భంగా సూక్ష్మ, స్థూల కండరాల అభివృద్ధికి సంబంధించిన అంగన్వాడీ సిబ్బంది తయారు చేసిన కృత్యాలు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం 2020లో భాగంగా బాల్య సంరక్షణ విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా అంగన్వాడీ వర్కర్ల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యమన్నారు. అలాగే మూడు నుంచి 8ఏళ్లలోపు పిల్లల శారీరక, మానసిక మేధోభివృద్ధికి కృషిలో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో అంగనవాడీ కేంద్రాలను అందుబాటులో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో కలిపి అంగన్వాడీలు, ఉపాధ్యాయులు సంయుక్తంగా బోధించాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. కార్య క్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు శ్రీదేవి, రేవతి, దౌలత్ వున్నీసా, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండల కేంద్రంలో గత అరు రోజులుగా జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఇఒ -1 డి.అప్పలనాయుడు మాట్లాడుతు జాతీయ విద్యావిధానం 2020 బాల్య సంరక్షణ, విద్య విధానాలకు ప్రాముఖ్యత ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన అంగన్వాడీ కార్యకర్తలు మెలుకువ వినియోగించు కోవాలని, తమ పరిధిలో చక్కగా అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ -2 కొండలరావు, ఐసిడిఎస్ సెక్టార్ సూపర్ వైజర్ ఆర్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలోని సుంకరవీధిలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎస్ఐ ఎం.రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువకులు క్రీడల్లో రాణించడం ఎంతో అవసరమన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల కూడా అవగాహన కలిగి యువత సన్మార్గంలో నడవాలని కోరారు. ఎల్ వి ఆర్ సేవా సంస్థ చైర్మన్, పెదబోగిలి మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. యువతకు, సేవా కార్యక్రమాలకు తమ సంస్థ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ టోర్నమెంట్లో 14టీములు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుంకరవీధి నుంచి 3 టీములు, బుడ్డిపేట, పెదభోగిలి నుండి 4, చినభోగిలి నుండి 3 టీములు, ఉన్నత పాఠశాల, దేవరవీధి నుండి టీములు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్లో ప్రథమ విజేతకు రూ.5వేలు, ద్వితీయ విజేతకు రూ.3వేలు నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు ఎల్‌విఆర్ సేవా సంస్థ సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుంకర వీధి యూత్, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రాజేష్